ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 11 ఏప్రిల్ 2024

నేడు ఈదుల్ ఫితర్



విద్యుద్దీప కాంతుల్లో పుట్టపర్తిలోని జామియా మస్జిద్.. ఆకాశంలో దర్శనమిస్తున్న నెలవంక..

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 10: ముస్లింల ప్రధాన పండుగ గురువారం నిర్వహించుకోనున్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఆచరించారు. చివరిరోజు బుధవారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో ఈదుల్‌ఫితర్ (రంజాన్)ను గురువారం చేసుకోనున్నారు. ఉదయాన్నే ముస్లింలందరూ ఈద్గా మైదానాలకు చేరుకుంటారు. అక్కడ సామూహిక ప్రార్థనల్లో పాల్గొంటారు. అనంతరం సమస్త శుభాలు కలగాలనీ, పాపాలను నశింపజేసి పుణ్యాలు ప్రసాదించాలని అల్లాను (దువా) వేడుకుంటారు. శక్తి మేర దానధర్మాలు చేస్తారు. పరస్పరం రంజాన్ ముబారక్ చెప్పుకుంటారు.

ఎమ్మెల్యే దుద్దుకుంటపై పోలీసులకు ఫిర్యాదు

నల్లమాడ, ఏప్రిల్ 10: సత్యసాయి తాగునీటిని అక్రమంగా తోటకు వాడుకుంటున్నాడంటూ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై సత్యసాయి నీటి పథకం ఏఈ భార్గవ్ బుధవారం నల్లమాడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్రమ కనెక్షన్ తీసుకున్న ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్ఐ రమేశ్‌బాబు తెలిపారు. పరిశీలించి, కేసు నమోదు చేస్తామని ఆయన వెల్లడించారు.



ఎండిపోతున్న టమోటా పంటకు ట్యాంకర్‌తో నీరు పడుతున్న రైతు

పంట సంకటం..!

లక్షలు పోసి.. పంటల సాగు.. వర్షాభావంతో అడుగంటుతున్న భూగర్భజలాలు




ఫొటోలోని యువకుడి పేరు సాయి. స్వగ్రామం తనకల్లు. డిగ్రీ వరకు చదివాడు. ఆరెకరాల భూమి కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేశాడు. మూడెకరాలు చొప్పున టమోటా, మొక్కజొన్న పంటలు వేశాడు. పంట చేతికొచ్చే సమయంలో బోరుబావిలో నీటిమట్టం పడిపోయింది. పంటను కాపాడుకోవడం కష్టతరంగా మారింది. లక్షలు పెట్టుబడులు పెట్టి, ఆరుగాలం శ్రమించి కాపాడుకున్న పంట కళ్లెదుటే ఎండిపోతుంటే తట్టుకోలేకపోయాడు. ఎలాగైనా కాపాడుకోవాలనుకున్నాడు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ఉపక్రమించాడు. ఇలా.. పంటను కచ్చితంగా కాపాడుకుంటానన్న నమ్మకం లేదు. ప్రయత్నం మాత్రమే చేస్తున్నాడు. పంటల సాగు, నీటి ట్యాంకులకు రూ.5లక్షల వరకు వెచ్చించాడు. పంటలను కాపాడుకోగలిగితే ఫర్వాలేదు. లేదంటే పెట్టుబడితోపాటు రైతు కష్టం మట్టిలో కలిసిపోనున్నాయి. జిల్లాలో చాలాచోట్ల రైతులు పడుతున్న కష్టం ఇది. తీవ్ర వర్షాభావంతో బోరుబావులు ఎండిపోతుండడంతో పంటలను కాపాడుకోవడం సంకటంగా మారింది.

- తనకల్లు



రైతులు రూ.లక్షలు పెట్టుబడిగా పెట్టి రబీలో బోరుబావుల కింద పంటలు సాగు చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు చుట్టుముట్టాయి. బోరుబావులు ఎండిపోతున్నాయి. కొన్ని ఇప్పటికే వట్టిపోయాయి, మిగతా వాటిలో నీరు ఎప్పుడు ఆగిపోతుందోనన్న అయోమయం నెలకొంది. ఈ పరిస్థితుల్లో పంటలను కాపాడుకోవడం రైతులకు కష్టంగా మారింది. కొందరు రైతులు ట్యాంకర్ల ద్వారా నీరు అందిస్తున్నారు. మరికొందరు ఇప్పటికే చాలా అప్పులు చేసి పంటలు సాగు చేశామనీ, అవి చాలవన్నట్లు మళ్లీ అప్పులు తెచ్చి ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయడం ఎందుకులే అని పంటలను వదిలేసుకుంటున్నారు. ఇలా పంట సంకట స్థితిలో పడింది.



- కీలక దశలో వట్టిపోతున్న బోర్లు
- ఎండుతున్న పంటలు
- కాపాడుకునేందుకు అన్నదాతల అవస్థలు
- ఆరుగాల కష్టం వృథాయేనా?



పడిపోయిన భూగర్భజలమట్టం

తనకల్లు మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు వర్షాధార వ్యవసాయాన్ని మానివేసి, కేవలం బోర్లు, బావులు, చెరువులు, కుంటల కింద మాత్రమే పంటలు వేస్తున్నారు. దోస, కర్బూజా, టమోటా, మిరప, వంగ తదితర పంటల సాగుకు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి అప్పులు చేసి, బోర్లు వేసుకున్నారు. బోర్లకింద పంటలు సాగుచేస్తున్నారు. ఉన్నఫలంగా 20 రోజులుగా బోర్లలో నీటి మట్టాలు అనూహ్యంగా పడిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రూ.లక్షలు అప్పులు చేసి సాగుచేసిన పంటలు.. బోర్లలో నీటిమట్టం పడిపోవడంతో కళ్లెదుటే ఎండిపోతున్నాయి. చూస్తూ ఉండలేక రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. మరికొంతమంది రైతులు ట్యాంకర్లతో నీటిని తెచ్చి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇంకొంతమంది ఇప్పటికే అప్పులు చేశామనీ, మరిన్ని చేసేందుకు ధైర్యం చాలక పంటలను వదిలేస్తున్నారు. మండలవ్యాప్తంగా ప్రస్తుతం భూగర్భ జలమట్టం 480 నుంచి 550 అడుగులకు పడిపోయినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. మండలంలో రైతులు 1200 అడుగుల దాకా బోర్లు వేస్తున్నారు. అయినా నీరు పడకపోవడం, ఉన్న బోర్లలో నీరు తగ్గిపోతుండడంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈఏడాది హంద్రీనీవా కాలువలో నీరు ప్రవహించినా, చెరువులు, సీజీ ప్రాజెక్టును నింపకపోవడం, పాపాఘ్ని నదికి నీరివ్వకపోవడంతో బోర్లలో నీటిమట్టాలు పడిపోతున్నాయని మండల రైతులు వాపోతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హంద్రీనీవా నీటిని పుంగనూరుకు తరలించుకుపోతున్నారు. మండల ప్రజలకు నీరు ఇవ్వాలన్న ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమని రైతులు అంటున్నారు. ఇక్కడి ప్రజాప్రతినిధులు.. మంత్రితో నీటి విషయం మాట్లాడలేక వదిలేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వచ్చే ఏడాదైనా హంద్రీనీవా జలాలతో మండలంలోని చెరువులు, సీజీ ప్రాజెక్టు నింపాలనీ, పాపాఘ్ని నదికి నీరివ్వాలని ప్రజలు కోరుతున్నారు.





కాపాడుకోలేకపోయా..

బోరు కింద వంగ, మొక్కజొన్న నాలుగు ఎకరాల్లో సాగుచేశా. వంగ పూత, మొక్కజొన్న కంకి దశలో ఉండగా బోరులో నీరు ఆగిపోయింది. కళ్లెదుటే పంట ఎండిపోతున్నా కాపాడుకోలేకపోయా. దీంతో రూ.6 లక్షలు నష్టపోయా. హంద్రీనీవా జలాలతో చెరువులు నింపి ఉండుంటే ఈ దుస్థితి వచ్చేదికాదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదిశగా ఆలోచించాలి.

- రాజారెడ్డి, రైతు, సున్నంపల్లివాండ్లపల్లి



రూ.ఐదు లక్షలు నష్టం

రబీలో నాకున్న మూడెకరాల్లో వేరుశనగ సాగుచేశా. రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టా. పంట చేతికొస్తుందన్న సమయంలో బోరులో నీరు ఆగిపోయింది. పంట ఎండిపోయింది. ఇప్పటికే మూడు బోర్లు తవ్వా. మరొకటి తవ్వే పరిస్థితి లేదు. నీరుండి ఉంటే మూడెకరాల్లో 120 బస్తాల దిగుబడి వచ్చేది. పంట ఎండిపోవడంతో రూ. ఐదులక్షలు నష్టపోయా. బోర్లకింద సాగుచేసి పంట నష్టపోయిన రైతులకు కూడా ప్రభుత్వం ఇన్సూరెన్స్, ఇన్‌పుడ్ సబ్సిడీ ఇవ్వాలి. పరిస్థితి ఇలాగే ఉంటే రైతులు బోర్లకింద కూడా వ్యవసాయం వదిలేస్తారు.

- ఈశ్వర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివారిపల్లి



చెరువులు నింపి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదు

హంద్రీనీవా కాలువ మండలం మీదుగానే వెళ్తోంది. కాలువలో ఐదునెలలపాటు నీరు పారించారు. పుంగనూరుకు తీసుకెళ్లారు. మండలంలోని చెరువులు, సీజీ ప్రాజెక్టు, పాపాఘ్ని నదికి మాత్రం నీరివ్వలేదు. ఆ ఆలోచన ప్రజాప్రతినిధులకు లేకపోవడం బాధాకరం. చెరువులు, పాపాఘ్ని నది, ప్రాజెక్టుకు నీరు ఇచ్చి ఉండుంటే ప్రస్తుతం రైతులు పంటలు వదిలేసే పరిస్థితి ఉత్పన్నమయ్యేది కాదు.

- శ్రీధర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివాండ్లపల్లి

దౌర్జన్యకాండ..!

పేట్రేగిపోతున్న వైసీపీ మూకలు

- టీడీపీ వర్గీయులపై దాడులు
- కోడ్ వచ్చినా.. ఆగని అకృత్యాలు
- ప్రేక్షకపాత్రలో పోలీసులు
- తూతూమంత్రంగా కేసులు

హిందూపురం, ఏప్రిల్ 10: వైసీపీ ఐదేళ్ల పాలనలో దౌర్జన్యకాండ సాగించారు. ప్రతిపక్ష నాయకులపై దాడులతో పేట్రేగిపోయారు. మొన్నటి వరకు వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఎన్నికల కోడ్ వచ్చాక కూడా ప్రతిపక్షాలపై దాడులకు తెగబడుతుండటం గమనార్హం. హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లో ఇటీవల టీడీపీ, ఇతర పార్టీల నాయకులపై దాడులు చేశారు. వైసీపీ వర్గాలు పేట్రేగిపోతున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

వరుస దాడులు

హిందూపురం పట్టణంలో 15రోజుల క్రితం అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు.. వేరే పార్టీ కార్యకర్తలపై దాడులు చేశారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు ఒకే సామాజికవర్గంవారు కావడంతో స్టేషన్ వరకు వెళ్లకుండా అక్కడే పంచాయితీ చేసుకున్నారు. హిందూపురం మండలంలో పది రోజుల క్రితం అధికార పార్టీకి చెందిన కొంతమంది తెలుగుదేశం పార్టీ నాయకులపై దురుసుగా వ్యవహరించి, దాడులకు యత్నించారు. నాలుగు రోజుల క్రితం హిందూపురం పట్టణంలో వైసీపీ నాయకులు అదే పార్టీకి చెందిన ఆర్యవైశ్య కులస్థులపై విచక్షణారహితంగా దాడిచేశారు. గోరంట్ల మండలంలో సోమవారం రాత్రి తెలుగుదేశం కార్యకర్తలపై దాడికి యత్నించారు. ఇందులో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పరిగి మండలంలో కూడా వారం క్రితం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలపై అధికార పార్టీ నాయకులు దాడులు చేశారు. రొద్దం మండలంలో కూడా ఇలాంటి పరిస్థితే ఎదురైంది. గోరంట్ల మండలంలో ఓ దళిత పంచాయతీ కార్మికుడిపై అధికార పార్టీకి చెందిన ఉప సర్పంచ్ పత్రికలో రాయలేని విధంగా దుర్భాషలాడాడు. ఇవి మచ్చుకు మాత్రమే. బయటకు రానివి కోకొల్లలు.

అన్నిచోట్లా అదేతీరు..

ఇటీవల అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రతిపక్ష పార్టీల నాయకులతోపాటు సామాన్యులపై కూడా పల్లె పట్నం తేడాలేకుండా దాడులకు తెగబడుతున్నారు. ఒకప్పుడు నియోజకవర్గంలో ఒకట్రెండు చోట్లమాత్రమే ఈ పరిస్థితి ఉండేది. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఉంది.



అధికార పార్టీ నాయకులు ఎన్నడూలేనివిధంగా దాడులు చేయడం, దౌర్జన్యాలకు తెగబడడం సర్వసాధారణమైంది. ఎన్నికల వేళ భయభ్రాంతులకు లోనుచేసే వ్యూహంతో దాడులకు తెగబడుతున్నట్లు సమాచారం. దీంతో పల్లె, పట్నంలో కూడా బెదిరిస్తే పోలింగ్ రోజుకు కొన్ని చోట్లయినా ప్రతిపక్ష పార్టీల నాయకులు కొంతవరకు తలొగ్గుతారని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో చైతన్యం, ప్రభుత్వంపై వ్యతిరేకత ఎక్కువగా ఉండటంతో ఇలాంటివి పనిచేయవని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.




పోలీసుల ప్రేక్షకపాత్ర

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా కొంతమంది పోలీసుల్లో చలనం రాలేదు. ఇప్పటికీ కొంతమంది అధికారులు.. వైసీపీతో అంటకాగుతున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని, వైసీపీ వర్గీయులు అక్రమాలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకుల వ్యవహారాలను పోలీసులు ప్రశ్నించకపోవడం శోచనీయం. అంతేకాదు, ఏదైనా ఘటన జరిగితే దానిని తక్కువగా చూపడం, కేసుల్లో పసలేకుండా పెట్టడం బట్టి చూస్తే అధికార పార్టీ నాయకులపై ఇంకా వారికి ఎంత ప్రేమ ఉందో అర్థం అవుతుంది. ఇటీవల బదిలీపై వచ్చిన కొంతమంది పోలీసు అధికారులు.. వైసీపీ నాయకుల సిఫార్సులతో ఇక్కడే ఉందామని భావిస్తున్నారు. ఈ కారణంతోనూ అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నట్లు చర్చ సాగుతోంది. అధికార పార్టీ నాయకులు ఏదైనా చేస్తే వారికి అనుకూలంగా మలుస్తుండడమే ఇందుకు నిదర్శనం. ఈ పరిస్థితుల్లో ఏదైనా ఘటన జరిగితే తూతూమంత్రంగా తీవ్రత లేని సెక్షన్ల కింద కేసులు కడుతున్నారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఇటీవల హిందూపురంలో జరిగిన ఘటనకు సంబంధించి అధికార పార్టీ నాయకులపై సాధారణ సెక్షన్ల కింద కేసు పెట్టారన్న వాదనలున్నాయి. అధికార పార్టీ నాయకులు పెద్ద తప్పు చేసినా చిన్న కేసు పెట్టడం చూస్తే పోలీసులు కేసులను తూతూమంత్రంగా ముగిస్తున్న విసం స్పష్టమవుతోంది. ఏది ఏమైనా ఎన్నికల వేళ వైసీపీ నాయకులు దాడులకు తెగబడుతుండడం, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



వైభవం.. జ్యోతుల మహోత్సవం



నృత్యాలను తిలకిస్తున్న ప్రజలు



బంగారు కవచంతో చౌడమ్మ అమ్మవారు



జ్యోతులతో నృత్యం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 10: పట్టణ పరిధి ముద్దిరెడ్డిపల్లిలో గ్రామదేవత చౌడమ్మ తల్లి జ్యోతుల ఉత్సవం అంగరంగ వైభవంగా సాగింది. మంగళవారం అర్థరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జ్యోతుల మహోత్సవం సాగింది. అమ్మవారి మూలవిరాట్‌ను బంగారు కవచంతో అలంకరించారు. తొగటవీర క్షత్రీయుల ఆరాధ్యదైవం చౌడమ్మతల్లి జ్యోతుల ఉత్సవం ఏటా ఉగాది మరుసటి రోజు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయం ముందు భాగంలో అమ్మవారికి అఖండ దీపం వెలిగించి, పూజలు చేశారు. హోమాలు, అర్చనలతో పరిసర ప్రాంతం మార్మోగింది. జ్యోతులను పురుషులు మోయడం ఆనవాయితీ. కొంతమంది భజనలు చేస్తుండగా.. మరి కొంతమంది జ్యోతులు మోస్తూ అమ్మవారిని కొలుస్తారు. అనంతరం బలిదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బండారు బాలాజీ, కమిటీ సభ్యుడు నాగరాజు, పామిశెట్టి శేఖర్, నాగేంద్రకుమార్, మంచాల మారుతి, రామకృష్ణ, డీసీ రఘు పాల్గొన్నారు.



ఉట్లపరుషకు హాజరైన జనం.. ఉట్లమాను ఎక్కుతున్న యువకులు (ఇన్‌సెట్‌లో..)

ఉత్సాహంగా ఉట్లపరుష

ధర్మవరం, ఏప్రిల్ 10: పట్టణంలోని దుర్గమ్మ దేవాలయం వద్ద ఉట్ల పరుష బుధవారం ఉత్సాహంగా సాగింది. ఉగాదిని పురస్కరించుకుని సాయంత్రం 5.30 గంటలకు ఉట్లపరుష నిర్వహించారు. ఉట్టిమాను ఎక్కేందుకు యువకులు పోటీపడ్డారు. గంటపాటు ఉత్సాహంగా సాగిన పోటీలో బోయ వంశీ విజేతగా నిలిచాడు. అతడికి నిర్వాహకులు రూ.10,116 నగదు బహుమతి అందజేశారు. పెద్దఎత్తున జనం తరలిరావడంతో ఆప్రాంతం కిక్కిరిసిపోయింది. అనంతరం యువతులు, మహిళలు రంగులు చల్లుకున్నారు.

ఉష్ణోగ్రతలు (బుధ)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	38.0	24.0
కదిరి	37.0	23.0
ధర్మవరం	38.0	25.0
హిందూపురం	38.0	23.0
పెనుకొండ	36.0	22.0

అణగారిన వర్గాలకు అండగా నిలవండి

- రుణ వితరణ ప్రణాళికలు రూపొందించండి
- బ్యాంకర్లకు జేసీ సూచన



బ్యాంకు అధికారులతో సమీక్షిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

పుట్టపర్తి, ఏప్రిల్ 10: అణగారిన వర్గాలకు అండగా నిలవాలనీ, వారి సంక్షేమానికి రుణ వితరణ ప్రణాళికలు రూపొందించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్.. బ్యాంకర్లకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకర్లతో జిల్లాస్థాయి సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ... బ్యాంకుల ద్వారా రుణాల పంపిణీకి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఏ కారణంతోనైనా రుణాలు ఇవ్వకున్నా, దరఖాస్తులను తిరస్కరించినా సంబంధిత నివేదికను తనకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం రమణకుమార్, నాబార్డు ప్రతినిధి అనూరాధ, జిల్లా వ్యవసాయధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, యూనియన్ బ్యాంకు మేనేజర్ శివప్రసాద్, కెనరాబ్యాంకు ప్రతినిధి కిరణ్‌కుమార్, ఏఓ రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

మద్యం బ్లాక్..!



పరిమితి విధించిన ఎన్నికల కమిషన్
స్టాక్ రాగానే పక్కదారి పట్టిస్తున్న సిబ్బంది
అధికార పార్టీవారి బెల్టుషాపులకు తరలింపు
బ్లాక్‌లో అధిక ధరలకు భారీగా విక్రయాలు

అనంతపురం అర్బన్/శింగనమల, ఏప్రిల్ 10: మద్యం అమ్మకాలపై ఎన్నికల కమిషన్ విధించిన పరిమితిని కూడా అధికార పార్టీ నాయకులు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారు. ఉన్న స్టాక్‌ను కొందరు కొనుగోలు చేసి బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. గత ఏడాది మద్యం విక్రయాలపై అదనంగా 30 శాతానికి మించి అమ్మకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అమ్మకాలు పరిమితి దాటితే ఖచ్చితమైన వివరణ ఇవ్వాలని షరతు పెట్టింది. ఈ నిబంధనలను కొందరు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. రోజువారీ టార్గెట్ పూర్తి అయ్యిందని చెబుతూ.. జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల మధ్యాహ్నం లోపలే దుకాణాలను కట్టేస్తున్నారు. ఆ తరువాత మందు బ్లాక్‌లో దొరుకుతోంది. ఈ దందాకు ఎక్సైజ్ శాఖకు చెందిన కొందరు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులకు అడిగినం మద్యం ఇస్తున్నారు. మద్యం బాటిళ్ల బాక్సులను వారికోసం రహస్యంగా తరలిస్తున్నారని సమాచారం. ఈ పరిణామాలు మద్యం ప్రియుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో బార్ అండ్ రెస్టారెంట్లకు క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.70 నుంచి రూ.100 చెల్లించి మద్యం సేవిస్తున్నారు. బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తీసుకుంటామని అనంతపురం ఐఎంఎల్ డిపో మేనేజర్ రాంబాబు హెచ్చరించారు.

వైసీపీ స్టోరేజీ..?

అధికార పార్టీ నాయకులు శింగనమల నియోజకవర్గంలో మద్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. మద్యం అమ్మకాలపై పరిమితి నేపథ్యంలో ఎన్నికలకు కావాల్సిన మద్యాన్ని కొని దాచిపెడుతున్నారని సమాచారం. ఉదయం కాసేపు అమ్మి.. ఆ తరువాత మద్యం దుకాణాలను కట్టేయడంతో మందుబాబులు బయట క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా చెల్లించి కొంటున్నారు. శింగనమల మండలంలో గత 10 రోజులుగా ఈ తంతు సాగుతోంది. నియోజకవర్గంలో శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల మండలాల్లో 12 మద్యం దుకాణలను ప్రభుత్వం నడుపుతోంది. వీటిలో రోజుకు 4,273 లీటర్లు అమ్మాలని టార్గెట్ ఇచ్చారు. అయితే చాలా మద్యం దుకాణలో పనిచేసే వ్యక్తులు వైసీపీ సానుభూతిపరులు కావడంతో తమ పార్టీ కోసం మద్యం బాటిళ్లను పక్కదారి పట్టిస్తున్నారు. శింగనమల మండలంలో మూడు దుకాణలలో రోజుకు 1,075 లీటర్లు మాత్రమే అమ్మేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో రోజూ ఉదయం స్టాక్ రాగానే మొదట వైసీపీ వర్గీయులు నిర్వహించే బెల్ట్ షాపులకు ఒక బాటిల్ మీద రూ.10 అదనంగా తీసుకుని అమ్ముతున్నారు. ఆ తరువాత వైసీపీ నాయకులు చెప్పిన వారికి కొన్ని కేసుల మద్యం ఇస్తున్నారు. రోజువారీ కొనుగోలు చేసేవారికి రోజుకు గంట నుంచి రెండు గంటలు మాత్రమే అమ్ముతున్నారు. ఆ తరువాత పరిమితి ముగిసిందని దుకాణలను మూసివేస్తున్నారు.


అనంతలో మద్యం దుకాణం వద్ద రద్దీ

నిఘా ఎక్కడ..?

రోజువారీ విక్రయాలపై పరిమితి విధించి.. సెబ్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో నిఘా ఏమాత్రం లేకపోవడంతో మద్యం అధికార పార్టీవారి ఇళ్లకు వెళుతోంది. మద్యం దుకాణాల నుంచి 70 శాతానికి పైగా బెల్ట్ షాపులకు, వైసీపీ నాయకులకు అమ్ముతున్నారు. సెబ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది.

మందుబాబులకు తంటాలు

● కూడేరు మండలంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజు నుంచి మద్యం దుకాణాలను సాయంత్రానికే బంద్ చేస్తున్నారు. దీంతో మందుబాబులు షాపుల వద్ద ఆందోళనకు దిగుతున్నారు. కూడేరు మండలంలో రెండు మద్యం షాపులు ఉన్నాయి. రెండింటిలోనూ మద్యం కొరత ఏర్పడుతోంది. దీంతో దుకాణాల వద్ద మద్యం కోసం పలువురు క్యూ కడుతున్నారు.

● కణేకల్లు మండలంలో మద్యం దుకాణాలు సాయంత్రానికే మూతపడుతున్నాయి. వారంరోజుల నుంచి ఇదే పరిస్థితి అని మద్యం ప్రియులు వాపోతున్నారు. సాధారణంగా పనులు ముగించుకుని.. సాయంత్రం వేళల్లో మద్యం దుకాణాలకు వెళుతుంటారు. అలాంటివారిని మూసిన తలుపులు వెక్కిరిస్తున్నాయి. పరిమితి ముగిసిందని సాకు చెప్పి సిబ్బంది వెళ్లిపోతున్నారు.
ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలో మద్యం విక్రయాలపై పరిమితి విధించామని సెబ్ సీఐ కిషోర్ తెలిపారు. పరిమితి మధ్యాహ్నానికే దాటితే దుకాణాలను బంద్ చేస్తున్నారని తెలిపారు.

● ధర్మవరం నియోజకవర్గంలో రాత్రి ఏడు గంటలకల్లా మద్యం దుకాణాలను మూసేస్తున్నారు. కొన్ని మండలాల్లో సాయంత్రం 5 గంటలకే మూసేస్తున్నారు. కొత్తచెరువులో రెండు మద్యం దుకాణాలను బుధవారం రాత్రి 7గంటలకే బంద్ చేశారు. విషయం తెలియక మద్యం ప్రియులు అక్కడ భారీగా గుమిగూడారు. ధర్మవరం పట్టణంలోని కదిరిగేటు వద్ద మద్యం దుకాణాన్ని మధ్యాహ్నం 2 గంటలకే మూసేశారు. మిగిలిన మద్యం దుకాణాలు 5 గంటలకు బంద్‌చేశారు. బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల్లో 5 గంటలకే మద్యం దుకాణాలను బంద్‌చేశారు.

● గుంతకల్లు పట్టణంలో మద్యం విక్రయాలు బ్లాక్ మార్కెట్‌లో సాగుతున్నాయి. దుకాణాలలో స్టాక్‌ను బ్లాక్ మార్కెట్‌కు తరలించి.. అధిక ధరలకు అమ్ముతున్నారు. ఎన్నికల వేళ మద్యానికి డిమాండ్ పెరిగిపోగా.. షాపుల్లో మద్యం దొరకడం గగనమైంది. బ్లాక్‌లో క్వార్టరుపై రూ.50 నుంచి రూ.80 అదనంగా వసూలు చేస్తున్నారు. డిమాండ్ ఉండే బ్రాండ్లను ఎక్కువగా బ్లాక్‌లో అమ్ముతున్నారు. బార్ అండ్ రెస్టారెంట్‌లో బ్రాండ్‌ను బట్టి రూ.80 నుంచి రూ.120 దాకా ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. రూ.100 రేంజ్‌లో ఉన్న మద్యం బాటిళ్లను దుకాణాల్లో ఎక్కడా అమ్మడంలేదు. ఆ మందంతా గ్రామలకు తరలిపోతోంది. రూ.30 నుంచి రూ.50 వరకూ అధిక ధరలకు పల్లెల్లో అమ్ముడౌతోంది. ద్విచక్రవాహనంలో పట్టణానికి వచ్చి కొనేకంటే.. గ్రామంలో బ్లాక్ లభించే మద్యాన్ని కొనడమే మేలని మద్యంప్రియులు అక్కడే కొంటున్నారు.

నిర్వాహకుల చేతివాటం..?

గార్లదిన్నె మండలంలో ప్రభుత్వ దుకాణాల్లోని మద్యం పక్కదారి పడుతోంది. మద్యం షాపులను మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 లోపల మూసివేస్తున్నారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. క్వార్టర్ బాటిల్ మద్యాన్ని రూ.50 నుంచి రూ.90 అధిక ధరలకు బ్లాక్‌లో అమ్ముతున్నారు.

నామినేషన్లకు ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టరు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 10: నామినేషన్ల ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని కలెక్టరు డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అమిత్‌బర్దర్‌తో ఆయన నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 18న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఆ రోజు నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంత పార్లమెంటు నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా కలెక్టర్ ఉంటారని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి ఉంటారన్నారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన రోజునే స్క్రూట్నీ చేసి వివరాలు తప్పుగా ఉంటే వెంటనే ఆయా అభ్యర్థులకు తెలపాలన్నారు. ఈ ప్రక్రియ కోసం కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ అంజన్‌బాబు పాల్గొన్నారు.

ఎప్పుడూ అందుబాటులో ఉంటాం

సమస్యలను మా దృష్టికి తీసుకురండి
రాజకీయపార్టీల సమావేశంలో కలెక్టరు, ఎస్పీ

అనంతపురం టౌన్, ఏప్రిల్ 10: ఎప్పుడూ అందుబాటులో ఉంటామని, ఎన్నికలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్‌బర్దర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తనతోపాటు ఎస్పీ అందుబాటులో ఉంటారని, సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త ఓటరు నమోదుకు ఈనెల 14 వరకు అవకాశం ఉందన్నారు. రాజకీయపార్టీలు అనుమతుల కోసం సువిధ, ఎన్కోర్‌యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఆలస్యం లేకుండా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, నడవలేని దివ్యాంగులకు హోం ఓటింగ్ సౌకర్యం ఉందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ నిబద్ధతతో పనిచేస్తుందన్నారు. ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దన్నారు. రాప్తాడు, తాడిపత్రి, ఉరవకొండ నియోజకవర్గాల్లో ప్రత్యేక పోలీస్ బందోబస్తు కొనసాగిస్తామని తెలిపారు.

13న కదిరిలో బాలకృష్ణ పర్యటన


మాట్లాడుతున్న కందికుంట, బీవీ

కదిరి, ఏప్రిల్ 10: సైకిల్ రావాలి యాత్రంలో భాగంగా హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఈనెల 13న కదిరిలో పర్యటించనున్నట్లు కదిరి కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు తెలిపారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నందమూరి బాలకృష్ణ సైకిల్ రావాలి.. యాత్రలో భాగంగా కదిరికి ఉదయం చేరుకుంటారన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆయలంలో పూజలు చేస్తారన్నారు. అనంతరం పివిఆర్ గ్రాండ్‌లో విశ్రాంతి తీసుకుని, మధ్యాహ్నం 3గంటలకు ఫంక్షన్ హాల్‌లో గిరిజనులతో సమావేశం అవుతారన్నారు. అక్కడనుంచి ర్యాలీగా స్థానిక జీవిమాన్ సర్కిల్ చేరుకుని ప్రజలనుద్దేశించి మాట్లాడతారన్నారు. కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నీకు నేనున్నా.. పార్టీకి పనిచెయ్..

నిమ్మలకు చంద్రబాబు భరోసా


చంద్రబాబుతో నిమ్మల కిష్టప్ప, తనయుడు అంబరీష్

హిందూపురం, ఏప్రిల్ 10: 'నీకు నేనున్నాను. పార్టీ విజయానికి కృషి చేయి.' అంటూ మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పకు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు భరోసా ఇచ్చారు. జరుగబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు నిమ్మల కిష్టప్పకు అవకాశం లేకపోవడంతో కొద్ది రోజులుగా ఆయన సైలెంట్‌గా ఉన్నారు. ఈక్రమంలో మంగళవారం జిల్లాకు చెందిన ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు నిమ్మల కిష్టప్పను కలిశారు. ఈ విషయం అధిష్టానానికి చేరడంతో నిమ్మలను బుధవారం చంద్రబాబు హైదరాబాదులోని తన స్వగృహానికి పిలుపించుకున్నారు. సుమారు 20 నిమిషాల పాటు నిమ్మల చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నిమ్మల మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి తాను పని చేస్తున్నానని, ఈసారి ఎన్నికల్లో తనకు అవకాశం ఇవ్వలేదని చంద్రబాబుతో తెలిపారు. ముఖ్యంగా తమ సామాజికవర్గానికి మరో సీటు వస్తుందని ఆశించినా, రాకపోవడం కొంత బాధ కలిగించిందన్నారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ గతంలో మంత్రి పదవి, ఎంపీగా అవకాశం ఇచ్చామని, ప్రస్తుత రాజకీయ సమీకరణల నేపథ్యంలో అవకాశం లేదన్నారు. అయితే పార్టీ విజయానికి కృషి చేయమని, తమ రాజకీయ భవిష్యత్తు తాను చూసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు నిమ్మల కిష్టప్ప ఆంధ్రజ్యోతికి తెలిపారు. చంద్రబాబును కలిసిన వారిలో నిమ్మల తనయుడు నిమ్మల అంబరీష్ ఉన్నారు.

చీనీకాయలు టన్ను రూ.37 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 10: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.37 వేలు, కనిష్ఠంగా రూ.14 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 122 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

15న మహిళలకు ప్రత్యేకంగా ఉద్యోగమేళా

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 10: మొబైల్, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలో ఖాళీల భర్తీ కోసం మహిళలకు ఈనెల 15న కళ్యాణదుర్గం పట్టణంలోని పాత ఆర్డీటీ ఆసుపత్రిలోని ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 18-26 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, పదోతరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన మహిళలు అర్హులన్నారు. ఎంపికైన వారు కోలార్‌లోని మొబైల్ సంస్థలో నెలకు రూ.20వేలు వేతనంతో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న మహిళలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉద్యోగమేళాకు హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9513822234 నంబరులో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

గుత్తి సమీపంలో బైకును ఢీకొన్న కారు
అన్నదమ్ముల మృత్యువాత
పరిగి మండలంలో ఎదురెదురుగా ఢీకొన్న బైక్‌లు
ఇద్దరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు

గుత్తి రూరల్/హిందూపురం, ఏప్రిల్ 10: ఉమ్మడి జిల్లాలో బుధవారం రెండు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలలో నలుగురు మృతిచెందారు. అనంతపురం జిల్లా గుత్తి మండలంలో బైక్‌ను కారు ఢీకొని ఇద్దరు, శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని మరో ఇద్దరు మృత్యువాత పడ్డారు.


చంద్రశేఖర్‌రెడ్డి, శివానందరెడ్డి (ఫైల్)

అన్నదమ్ములు..

గుత్తి మండలం ఎంగిలిబండ గ్రామ శివారులో 67వ నంబరు జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తాడిపత్రి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, ఉమామహేశ్వరమ్మ దంపతుల కుమారులు చంద్రశేఖర్ రెడ్డి(26), శివనందారెడ్డి (24) మృత్యువాత పడ్డారు. గుత్తి పట్టణంలో స్నేహితుడు నిర్వహిస్తున్న దేవరలో పాల్గొనేందుకు అన్నదమ్ములిద్దరూ బైక్‌పై వచ్చారు. కార్యక్రమం ముగిసిన అనంతరం స్వగ్రామానికి బయలుదేరారు. ఎంగిలిబండ గ్రామ సమీపంలో వీరి బైక్‌ను రాంగ్ రూట్‌లో ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.


గుత్తి మండలంలో ప్రమాదానికి గురైన బైకు

కన్నీరుమున్నీరైన తండ్రి..

ప్రమాదం గురించి తెలియగానే సుబ్బారెడ్డి వెంటనే గుత్తికి చేరుకున్నారు. చేతికొచ్చిన కొడుకులిద్దరూ మృత్యువాత పడటంతో బోరున విలపించాడు. పెద్ద కుమారుడు చంద్రశేఖర్ రెడ్డి తన తండ్రికి వ్యవసాయ పనులలో చేదోడుగా ఉండేవాడు. చిన్న కుమారుడు శివనందారెడ్డి ఇంజనీరింగ్ పూర్తి చేశాడు. ఇటీవలే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో తమ కష్టాలు తీరుతాయని ఆ కుటుంబం భావించింది. పెద్ద కుమారుడికి వివాహం చేసే ప్రయత్నాల్లో ఉండగా.. ఈ ఘోరం జరిగింది. ఎక్కడికి వెళ్లినా అన్నదమ్ములు కలిసే వెళ్లేవారని, చివరకు కలిసే చనిపోయారని తండ్రి సుబ్బారెడ్డి కన్నీరుమున్నీరయ్యారు.

ప్రాణాలు తీసిన వేగం


అంజినమూర్తి, శివకుమార్ (ఫైల్)

పరిగి మండలం చెర్లోపల్లి క్రాస్ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు మృత్యువాత పడ్డారు. మృతులను పరిగి మండలం పెద్దరెడ్డిపల్లికి చెందిన వాల్మీకి అంజినమూర్తి(32), కర్ణాటకలోని తిరియూరుకు చెందిన శివకుమార్(36)గా గుర్తించారు. అంజినమూర్తి తన పిన్ని రామాంజినమ్మతో కలిసి మధుగిరి నుంచి స్వగ్రామానికి వస్తుండగా, వీరికి ఎదురుగా మరో బైక్‌పై శివకుమార్ వచ్చాడు. చెర్లోపల్లి గేటువద్ద వేగంగా వస్తున్న రెండు వాహనాలు అదుపుతప్పి ఢీకొన్నాయి. ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. అంజినమూర్తిని హిందూపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. రామాంజినమ్మ హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శివకుమార్‌ను కర్ణాటకలోని మధుగిరి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. అతివేగమే ప్రమాదానికి కారణమని పరిగి ఎఎస్‌ఐ జయలత తెలిపారు. అంజినమూర్తి భార్య నాలుగు నెలల గర్భిణి. శివకుమార్‌కు భార్య, ఐదుగురు కూతుళ్లు ఉన్నారు.


చెర్లోపల్లి క్రాస్ వద్ద ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ద్విచక్రవాహనాలు

నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు

ఇంటి వద్దకే బ్యాలెట్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 10: నడవలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే బ్యాలెట్ అవకాశానికి ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది. ఇంటినుంచే ఓటు వేయడానికి అర్హులైన వారు తమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వద్ద ముందుగానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అధికారులు స్వయంగా వచ్చి పరిశీలించి సమాచారం వాస్తవమైతే ఇంటి వద్ద ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. జిల్లా వ్యాప్తంగా దివ్యాంగులు 26,107మంది, 80 ఏళ్ల పైబడిన వృద్ధులు 25,175 మంది ఉన్నారు. ఇందులో నడవలేని, పోలింగ్‌బూత్‌కు వెళ్లి ఓటు వేయలేని దివ్యాంగులకు, వృద్ధులకు మాత్రమే ఇంటి వద్దకే బ్యాలెట్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు 9799 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వారు ఓటుకు దరఖాస్తు చేసుకుంటే ముందుగా పోలింగ్‌బూత్ స్థాయి అధికారులు ఫారం-12 అందిస్తారు. దానిని పూరించి ఇస్తే బీఎల్‌ఓలు తీసికెళ్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇస్తారు. ఈనెల 22వరకు ఓటుకు దరకాస్తుకు అవకాశం కల్పించారు. దివ్యాంగులకు ఎపిక్‌కార్డు, ధృవీకరణ పత్రం, వృద్ధులకు ఓటరు జాబితాలోని వయసును పరిగణలోకి తీసుకుంటారు.



రహస్యంగానే ఓటింగ్...

నడవలేని దివ్యాంగులు, 85ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటివద్దనే ఓటు వేయడానికి అవకాశం కల్పించినా ఓటు మాత్రం రహస్య పద్ధతిలోనే వేయాల్సి ఉంటుంది. ఓటరు ముందుగానే పలానా రోజు ఓటు వేస్తానని అధికారులకు సమాచారం ఇస్తారు. ఆ రోజున ఓటరు ఇంటికి నియోజకవర్గ ఎన్నికల నోడల్ అధికారి, మండలస్థాయిలో డిప్యూటీ తహసీల్దార్, పోలీసులు, వీడియోగ్రాఫర్‌ను తీసుకొని ఆ ఓటరు ఇంటికి వెళతారు. అందరి పర్యవేక్షణలో రహస్య విధానంలో బ్యాలెట్‌పై ఓటు వేసేలా చర్యలు తీసుకుంటారు. ఆ ఓట్లను తొలుత తహసీల్దార్ కార్యాలయానికి, అక్కడ నుంచి ఆర్‌ఓ కార్యాలయానికి తరలిస్తారు. ఇలా సేకరించిన ఓట్లను ఓట్లు లెక్కింపు చేపడుతున్న కేంద్రాలకు చేరుస్తారు.

కళ్యాణదుర్గంలో బీన్యూ మొబైల్ షోరూమ్ ప్రారంభం

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 10: పట్టణంలోని టీ సర్కిల్‌లో నూతనంగా బీన్యూ మొబైల్ షోరూంను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో ఎర్రగుంట్ల సాయి నిఖిలేష్ మాట్లాడుతూ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా నూతన మోడల్స్‌ను ఆకర్షణీయమైన ఆఫర్లతో ఆన్‌లైన్ ధరలకంటే తక్కువకు అందిస్తున్నామని తెలిపారు. శ్యామ్‌సంగ్, ఐఫోన్, రెడ్‌మీ, రియల్‌మీ, వన్ ప్లస్, వీవో, ఒప్పో సిరీస్ వంటి అనేక బ్రాండ్ల మొబైల్ ఫోన్లను తక్కువ ధరలకే అందిస్తున్నట్లు వివరించారు. వీటితోపాటు మొబైళ్లకు అవసరమైన బ్రాండెడ్ యాక్ససరీస్‌లను కూడా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని ఫీచర్లతో కూడిన ప్రముఖ బ్రాండ్ల టెలివిజన్లు ఎంఐ, హ్యుందయ్, వన్ ప్లస్ వంటి బ్రాండ్లను ప్రారంభధర రూ. 8999లతో అందుబాటులో వుంచామన్నారు. వీటితోపాటు హెచ్‌పీ, లెనోవా, ఏసర్, డెల్, ఏఎక్స్‌ఎల్ కంపెనీలకు చెందిన ల్యాప్‌టాప్‌లు ప్రారంభధర రూ. 16999లతో విక్రయిస్తున్నట్లు తెలిపారు. వినియోగదారుల సౌలభ్యం కోసం బజాజ్, టీవీఎస్ ఫైనాన్స్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు ద్వారా కొనుగోలుపై రూ. 5 వేల వరకు ఇన్‌స్టెంట్ క్యాష్‌బ్యాక్, బజాన్ ఫైనాన్స్‌పై రూ. 6 వేల వరకు డిస్కౌంట్‌ను ప్రారంభోత్సవం సందర్భంగా కళ్యాణదుర్గం ప్రజలకు ఈ ఆఫర్‌ను ప్రత్యేకంగా ఇస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి నితీష్ తెలిపారు. జీరో డెలివరీ సదుపాయం ఉందన్నారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ 040-48491111నెంబర్ కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు.



కళ్యాణదుర్గంలో ప్రారంభించిన బీన్యూ మొబైల్ షోరూమ్ వద్ద ఆల్ ద బెస్ట్ చెబుతున్న సంస్థ నిర్వాహకులు, సిబ్బంది

దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఏప్రిల్ 10: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా టెక్నికల్ ట్రైనీ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ మీనాక్షి బుధవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు ఈనెల 25 వరకు ప్రభుత్వ వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో దరఖాస్తు చేసుకోవాలన్నారు శిక్షణ మే 1వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు అనంతపురంలో ఉంటుందన్నారు. మే 1వ తేదీకి 18 సంవ్సరాలు నిండి, 45 సంవత్సరాలలోపు వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. 10వ తరగతి పాసై టీటీసీలో లోయర్, ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు పూర్తిచేసి వుండాలన్నారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్, ఏపీ జారీచేసిన ఒకేషనల్ పాస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. స్టేట్‌బోర్డ్ ఆఫ్ టెక్నికల్ అండ్ ట్రైనింగ్‌లో జారీచేసిన సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గుర్తింపు పొందిన ఐటీఐ ఇన్‌స్టిట్యూట్ జారీ చేసిన నేషనల్‌ట్రైడ్ కలిగినవారు, తెలుగు విశ్వవిద్యాలయం జారీ చేసిన కర్నాటిక్ మ్యూజిక్ (ఓకల్, వీణ, వయోలిన్)లో డిప్లొమా సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సర్టిఫికెట్ ఉండిన వారు అర్హులన్నారు.

గుత్తి- గుంతకల్లు ట్రాన్స్‌మిషన్ లైన్

పునరుద్ధరించాం: ట్రాన్స్‌కో

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దెబ్బతిన్న 132కేవీ గుత్తి రిసీవింగ్ స్టేషన్ - సింగిల్ సర్క్యూట్ గుంతకల్లు లైన్ ద్వారా విద్యుత్తు పంపిణీ వ్యవస్థను పునరుద్ధరించామని ఏపీ ట్రాన్స్‌కో బుధవారంనాడు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ లైన్ బ్రేక్‌డౌన్ అయినట్లుగా బుధవారం ఉదయం 8.20 గంటలకు గుర్తించామని వెల్లడించింది. ఈలైన్‌లో ఫీడర్ కాలిపోయినట్లుగా పెట్రోలింగ్ బృందం గుర్తించిందని ట్రాన్స్‌కో పేర్కొంది. ఫలితంగా గుంతకల్- ఉరవకొండ మధ్య 132 కేవీ లైన్ ద్వారా గృహ విద్యుత్తు సరఫరాకు విఘాతం ఏర్పడిందని వివరించింది. దీంతో.. బ్రేక్‌డౌన్ అయిన గుంతకల్లు, కేశపురం గ్రామాల్లో ప్రత్యామ్నాయ లైన్ ద్వారా విద్యుత్తును తాత్కాలికంగా అందించామని ట్రాన్స్‌కో వెల్లడించింది. మధ్యాహ్నం రెండు గంటల 44 నిమిషాలకు ఈ లైన్‌ను పునరుద్ధరించామనీ.. వ్యవసాయానికి అంతరాయ సమయం మేరకు అదనపు విద్యుత్తును సరఫరా చేశామని ట్రాన్స్‌కో ప్రకటనలో వెల్లడించింది.

వడదెబ్బతో మేకల కాపరి మృతి

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 10: మండలంలోని కెంచానపల్లి గ్రామానికి చెందిన వన్నూరుస్వామి(69) వడదెబ్బతో బుధవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వివరాల మేరకు వన్నూరప్ప మేకలు కాచుకుంటూ జీవనాన్ని గడిపేవాడు. మంగళవారం మధ్యాహ్నం అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. వైద్యులు వడదెబ్బతో మృతి చెందినట్లుగా నిర్ధారించారని కుటుంబసభ్యులు తెలిపారు.

జోరుగా కందికుంట ఎన్నికల ప్రచారం



కత్తివారిపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కందికుంట

గాండ్లపెంట, ఏప్రిల్ 10: మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీలోని యనుములవారిపల్లి, కత్తివారిపల్లి, సోమయాజులపల్లి, వేలపకుంట, పోరెడ్డివారిపల్లి గ్రామాల్లో బుధవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా చేపట్టారు. గ్రామాల్లోని నాయకులు, స్థానికులు ఆయనకు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. కందికుంట ఇంటింటా తిరిగి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని ప్రజల్ని కోరారు. పేదల అభ్యున్నతి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ కొండయ్య, ఎంపీటీసీ సభ్యుడు జయరామకృష్ణారెడ్డి, సింగల్ విండో మాజీ ఛైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీపీ గంగరాజు, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, నాయకులు రమణారెడ్డి, చంద్ర, ఆనంద్ జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలోకి చేరిక

గాండ్లపెంట: మండలంలోని తూపల్లి పంచాయతీ మునగలవారిపల్లికి చెందిన వైసీపీ ఉప సర్పంచ్ శ్రీనివాసులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ బుధవారం గ్రామంలోకి రాగా.. ఆయన సమక్షంలో పార్టీలోకి చేరారు. కందికుంట ఆయనకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు సిద్ధారెడ్డి, రవీంద్రారెడ్డి, కొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

బత్తలపల్లి, ఏప్రిల్ 10: మండల వ్యాప్తంగా గ్రామదేవతలకు బుధవారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉగాది పండుగ మరుసటి రోజున గ్రామదేవతలకు పూజలు నిర్వహించడం ఆనవాయితీ. మండలంలోని గరశనపల్లిలో పెద్దమ్మ, వెంకటగారిపల్లిలో సత్యమ్మ, బత్తలపల్లిలో గంగమ్మ, దుర్గమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. పూజారులు ఉదయమే అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి బోనాలు సమర్పించి, జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పోతులయ్య స్వామికి..



ప్రత్యేకాలంకరణలో పోతులయ్య స్వామి

ముదిగుబ్బ, ఏప్రిల్ 10: మండలంలోని కొడవండ్లపల్లి గ్రామంలో బుధవారం పోతులయ్య స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామస్థులు జ్యోతులు, బోనా లు సమర్పించారు. తొలుత అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామస్థులు ఎద్దుల బండ్లు, వాహనాలను సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. తర్వాత జ్యోతులు, బోనాలు సమర్పించారు. జంతుబలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉగాది మరుసటి రోజు పోతులయ్య స్వామికి జ్యోతులు, బోనాలు సమర్పించడం ఇక్క డి ఆనవాయితీ అని గ్రామపెద్దలు తెలిపారు. అలాగే గుంజేపల్లిలో చౌడమ్మకు గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి జ్యోతులు, బోనాలు సమర్పించారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి ఊరేగింపు



ఊరేగుతున్న చౌడేశ్వరీదేవి ఉత్సవ విగ్రహం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 10: మండలంలోని చౌడంపల్లి గ్రామంలో చౌడేశ్వరీ దేవి అమ్మవారి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారి దర్శనం చేసుకుని పూజల్లో పాల్గొన్నారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన పడమటి ఈరన్న ఉత్సవాలు

తాడిమర్రి, ఏప్రిల్ 10: మండలంలోని ఆత్మకూరు గ్రామంలో జరుగుతున్న పడమటి ఈరన్న స్వామి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఉగాది పండుగ ముందు రోజు నుంచి ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజుల పాటుగా సాగాయి. తాడిమర్రి మండలంతో పాటు ముదిగుబ్బ, బత్తలపల్లి, నార్పల, లింగాల మండలాల నుంచి కూడా భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. బియ్యం,బేడలు, పాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రైతులు ఎండ్లబండ్లను అలంకరించుకుని స్వామివారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శ్రీరామనవమి పండుగ వరకు ఇక్కడికి భక్తులు వస్తూనే ఉంటారు.

హైరిస్క్ గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 10: కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల గర్భిణులు, పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు వహించాలని వైద్యాధికారి కమల్‌రోహిత్ సూచించారు. మండలకేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో బుధవారం ప్రధానమంత్రిసురక్ష మాతృవందన అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. కాలానికి అగుణంగా వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల కలిగే ఆరోగ్యసమస్యల్లో వేసవిలో కలిగే వడదెబ్బ అతి ప్రమాదమైనదన్నారు. వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. తర్వాత 49మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించగా, 20మంది హైరిస్క్‌గా ఉన్నట్లు గుర్తించారు. వారికి ప్రత్యేక చికిత్సలు చేశారు.

ఎన్నికల విధులను బాధ్యతగా చేపట్టాలి

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి



మాట్లాడుతున్న ఎన్నికల ఆర్వో వెంకటశివరామిరెడ్డి

ధర్మవరం, ఏప్రిల్ 10: ఎన్నికల విజయవంతానికి అధికారులదే కీలక పాత్ర అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన నియోజకవర్గంలోని నాలుగు మండలాల పీఓలకు, ఏపీఓలకు ఎన్నికల విధులపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొసిడింగ్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు చేయాల్సిన విధుల గురించి వివరించారు. ప్రతి ఒక్క అధికారి ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల సంఘం చేపట్టే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. అనంతరం శిక్షకులు రాంప్రసాద్, శ్రీనివాసులు, హేమంత్ ఈవీఎంల వినియోగాన్ని ప్రయోగాత్మకంగా తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, తహసీల్దార్ రమేశ్, ఉప ఎన్నికల అధికారి షణ్ముఖ యాదవ్ పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న తహసీల్దార్

బత్తలపల్లి, ఏప్రిల్ 10: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ శివశంకర్ రాయక్, ఎస్ఐ శ్రీనివాసులు సమస్యాత్మక గ్రామాలపై వీఆర్ఓలతో సమీక్ష జరిపారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలు ఎన్ని ఉన్నాయని అని ఆరా తీశారు. దాదాపు 25 ఉన్నట్లు వీఆర్వోలు తెలపగా.. వీటి వివరాలను ఎన్నికల కమిషన్‌కు పంపుతామని చెప్పారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. వీఆర్వోలు ప్రతి రోజూ గ్రామాల్లో పర్యటించి ఏమైనా సమస్యలుంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. 85 ఏళ్ల నిండిన వృద్ధులకు, 40శాతం పైగా అంగవైకల్యం ఉండి నడవలేనివారికి ఇంటి వద్దే ఓటు హక్కు కల్పించనున్నట్లు వివరించారు.

కూటమి గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

● కూటమి పార్టీల శ్రేణులకు ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్ పిలుపు



మాట్లాడుతున్న సత్యకుమార్‌యాదవ్, పక్కన పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఏప్రిల్ 10: రానున్న 30 రోజులు చాలా కీలకమైనవని, ప్రతిగడపకూ వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేసి కూటమిని గెలిపించాలని అభ్యర్థించాలని కూటమి బీజేపీ అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని శారదానగర్‌లో గల బీజేపీ కార్యాలయంలో బుధవారం వారు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. తొలుత సత్యకుమార్ మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త, నాయకుడు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి కమలం గుర్తుకు ఓటువేసే విధంగా ప్రచారం నిర్వహించాలన్నారు. అనంతరం పరిటాలశ్రీరామ్ మాట్లాడుతూ...సత్యకుమార్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. కూటమిలోని మూడు పార్టీల నాయకులు సమన్వయంతో కలిసి ముందుకు వెళ్లాలన్నారు. హిందూపురం టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి గెలుపునకు సైకిల్‌గుర్తుకు ఓటేసేలా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అంతకు మునుపు సత్యకుమార్‌యాదవ్ కన్యకాపరమేశ్వరి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు.

చిలకంను కలిసిన సత్యకుమార్..

పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిని సత్యకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికలలో కూటమి తరఫున ప్రచారం నిర్వహించాలని ఆహ్వానించారు. ధర్మవరం అభివృద్ధిపై కూడా చిలకంతో సత్యకుమార్ చర్చించారు.

వైభవంగా రేణుకా యల్లమ్మ జాతర



ఓరువాయిలో పూజలందుకుంటున్న రేణుకాయల్లమ్మ ఉత్సవ విగ్రహం



నల్లచెరువులో కీలుగుర్రాల వేషధారణలో కళాకారులు

నల్లచెరువు, ఏప్రిల్ 10: మండలంలోని ఓరువాయిగ్రామంలో బుధవారం రేణుకా యల్లమ్మ జాతర వైభవంగా జరిగింది. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ప్రతి యేటా ఈజాతర ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో పూజారులు అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు చేశారు. స్థానికులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేంపు చేశారు. రైతులు పస్నేరపు బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంత రం పార్వేట నిర్వహించారు. చెక్కభజనలు, పాండ్రభజనలు, కోలాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఓరువాయి గ్రామం గ్రామస్థుల బంధుమిత్రులతో కిటకిటలాడింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ లింగన్న సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నల్లచెరువులో..

మండలకేంద్రంలో యల్లమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి జ్యోతులు సమర్పించి మొక్కులు తీసుకున్నారు. కీలుగుర్రాల వేషధారణలో కళాకారులు అలరించారు. జాతరలో ఉట్టిమాను ఉత్సవం జరిగింది.

సచివాలయానికి తొలగని ఎమ్మెల్యే స్టిక్కర్



రేగాటిపల్లిలో సచివాలయానికి ఉన్న ఎమ్మెల్యే స్టిక్కర్

ధర్మవరంరూరల్, ఏప్రిల్10: మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో గల సచివాలయ భవనానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఫొటో, ఫ్యాన్ గుర్తు ఉన్న స్టిక్కర్ ఇంకా దర్శనమిస్తూనే ఉంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి చాలా రోజులవుతున్నా.. ఇప్పటికీ ఆ స్టిక్కర్లు తొలగించకపోవడంపై గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రోజూ సచివాలయానికి వచ్చే అధికారులు ఆ స్టిక్కర్‌ను చూస్తూ కూడా చూడనట్లు వెళుతున్నారని, దీంతో ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్నారని మండిపడుతున్నారు. ఎన్నికల విధులను కూడా తూతూమంత్రంగా నిర్వహిస్తే ఎలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల కమిషన్ ఆదేశాలు సరిగా అమలయ్యేలా చూడాలని వారు కోరుతున్నారు.

ఓడీసీలో పోలీసు కవాతు

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 10: ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని స్పెషల్ బెటాలియన్ డీఎస్పీ గౌతమ్‌సవాంగ్, ఎస్ఐ వంశీకృష్ణ సూచించారు. మండలకేంద్రంలో స్పెషల్ బెటాలియన్ పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కవాతు చేశారు. ఈ సందర్భంగా బెటాలియన్ డీఎస్పీ, ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజల్లో ధైర్యం కల్పించడానికి, అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి కేంద్రసాయుధ బలగాలతో, పోలీసులతో కవాత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు రమేష్ బాబు, మగ్బుల్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య

తాడిమర్రి, ఏప్రిల్ 10: మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఎస్ఐ నాగస్వామి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నారశింపల్లి గ్రామానికి చెందిన నాగశివుడు(54) కూలిపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కాగా అతడు తరచూ మద్యం తాగుతుండేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం మద్యం తాగడానికి భార్య నారాయణమ్మను డబ్బులు అడిగాడు. ఇంట్లో బంధువులందరూ ఉన్నారు.. ఇప్పుడు మద్యం తాగడం అవసరమా అంటూ ఆమె మందలించి డబ్బులు ఇవ్వలేదు. ఇందుకు మనస్థాపం చెందిన నాగశివుడు ఇంటిలోనే ఓ గదిలోకి వెళ్లి చీరతో ఉరివేసుకున్నాడు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబసభ్యులు అతడిని కిందకు దించి బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అయితే అతను మార్గం మధ్యలోనే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

ముస్లింలకు ఎస్పీ రంజాన్ శుభాకాంక్షలు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 10: పవిత్రమైన రంజాన్ మాసంలో నెలరోజుల పాటు కఠోర ఉపవాసదీక్షలు ఆచరించి గురువారం రంజాన్ పండుగను జరుపుకుంటున్న ముస్లింలకు ఎస్పీ మాధవరెడ్డి బుధవారం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలందరికీ ఆ అల్లా సర్వశుభాలు ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

మతసామరస్యాన్ని పాటించండి

ముస్లింలందరూ మతసామరస్యాన్ని పాటిస్తూ ఎన్నికల నిబంధనల మేరకు రంజాన్ పర్వదినాన్ని జరుపుకోవాలని పుట్టపర్తిరూరల్ సీఐ రాగిరిరామయ్య తెలిపారు. స్థానిక రూరల్‌పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆయన ముస్లి మతపెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా శాంతియుతంగా పండగ జరుపుకోవాలన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు చేయండి: జేసీ

పుట్టపర్తి, ఏప్రిల్ 10: పాలిటెక్నిక్‌లో ప్రవేశానికి ఈనెల 27వ తేదీన పాలిసెట్ జరగనుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జేసీ అభిషేక్‌కుమార్ ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం ఆయన పాలిసెట్ పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్ష జరిపి మాట్లాడారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని , నోఫోన్ జోన్‌గా ప్రకటించాలని, విద్యార్థులకు ఆర్టీసీ సౌకర్యం కల్పించాలని సూచించారు. 23 కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తున్నామని, సుమారు 8వేల మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు జేసీ పేర్కొన్నారు.

30లోగా పన్ను బకాయిలు చెల్లించండి

ధర్మవరం, ఏప్రిల్ 10: మున్సిపాలిటీ పరిధిలో ఇంటి, ఆస్తి పన్నులను ఈ నెల 30వతేదీ లోగా ఏక మొత్తంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నుల బకాయిలను ఏకమొత్తంలో చెల్లించినవారికి 5శాతం రాయితీ ఇవ్వనున్నట్లు చెప్పారు. అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పన్నులను మున్సిపల్ కార్యాలయంలో, ఎల్‌పీ సర్కిల్, లక్ష్మీచెన్నకేశవపురం సచివాలయాల్లో చెల్లించాలని సూచించారు.

బాలకృష్ణ పర్యటనను విజయవంతం చేయండి

నంబులపూలకుంట, ఏప్రిల్ 10: హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఈనెల 13వ తేదీ కదిరిలోని పీవీఆర్ ఫంక్షన్‌హాల్‌కు రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైకిల్ రావాలని అనే కార్యక్రమంలో పాల్గొనేందుకు బాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి మండలంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి రావాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

పుట్టపర్తి: సత్యసాయి తాగునీటిని తోటకు మళ్లించిన ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజలకు సేవ చేయాల్సిన ఎమ్మెల్యేనే పేదల కోసం చేపట్టిన సత్యసాయివాటర్‌ను దొంగచాటుగా సొంత తోటకు ఉపయోగించుకుని ప్రజలకు అన్యాయం చేశారన్నారు. దాదాపు 4ఏళ్లగా ప్రజలకు అందించాల్సిన నీటిని సొంతానికి వాడుకున్న ఎమ్మెల్యేతోపాటు అందుకు సహకరించిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

భార్యను కాపురానికి పంపలేదని గొంతు కోసుకున్న భర్త

గోరంట్ల, ఏప్రిల్ 10: భార్యను కాపురానికి పంపలేదని మండలంలోని కల్లుమర్రికి చెందిన శివ గొంతుకోసుకుని బుధవారం ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కల్లుమర్రి గ్రామంలోని చాకలి గంగాద్రి కుమారుడు శివ వెల్డింగ్ పని చేస్తుంటాడు. ఎగువ గంగంపల్లికి చెందిన చాకలి శ్రీరాములు కుమార్తె గీతాంజలితో రెండేళ్ల కిందట అతడికి వివాహ మైంది. గీతాంజలి 11నెలల కిందట ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. తాగుడుకు బానిసైన శివ భార్యతో తరచూ గొడవపడేవాడు. ఇలాఉండగా ఉగాది పండుగకోసం మంగళవారం శివ అత్తగారింటికి వెళ్లాడు. భార్యను తనతో పంపాలని అత్తమామలను కోరాడు. మనవడికి శనివారం కేశఖండన చేశాక పంపుతామని వారు తెలిపారు. అయితేతన భార్యను కాపురానికి పంపలేదంటూ మనస్థాపం చెంది మద్యం తాగిన మత్తులో శివ అత్తగారింట్లోనే బ్లేడుతో పలుమార్లు గొంతుకోసుకున్నట్లు బంధువులు తెలిపా రు. తీవ్రంగా గాయపడిన అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స నిర్వహించారు. గొంతులోని థైరాయిడ్ ఎముక కనిపించేలా కోసుకోవడంతో మాట్లాడలేని స్థితిలో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. భర్త ఆత్మహత్య యత్నంపై భార్య గీతాంజలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జాడలేని సత్యసాయి నీరు

● గొంతెండుతున్న గ్రామాలు
● నీటిని దొంగచాటుగా తన తోటకు మళ్లించిన ఓ ప్రజాప్రతినిధి
● విషయం తెలిసినా మిన్నకుండిపోయిన అధికారులు
● ఆరోపణలు గుప్పించిన గ్రామాల ప్రజలు



నల్లమాడలో అరకొరగా వస్తున్న నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

నల్లమాడ, ఏప్రిల్ 10: మండలంలోని అన్ని గ్రామాలకు గత నాలుగేళ్లనుంచి సత్యసాయి తాగునీరు అందడం లేదు. దీంతో దాహార్తితో ప్రజలు అల్లాడిపోయారు. అయితే గత మూడురోజులుగా నీరు అరకొరగా పలు గ్రామాలకు సరఫరా అవుతున్నాయి. దీంతో గ్రామస్థులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లు రాని సత్య సాయి నీళ్లు.. ఇప్పుడెలా వస్తున్నాయని సందేహిస్తున్నారు. సత్యసాయి నీటి చౌర్యం జరుగుతుండడంతోనే గ్రామాలకు సరిగా అందడం లేదని, విషయం తెలిసినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని, సత్యసాయినీటితో ఓప్రజాప్రతినిధి తోట కళకళలాడుతోందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. కాగా మూడురోజులనుంచి సత్యసాయి నీరు అరకొరగా గ్రామాలకు సరఫరా అవుతోంది. అయితే గత నాలుగేళ్లనుంచి రాని నీళ్లు గత మూడురోజుల నుంచే ఎందుకు వస్తున్నాయని, ఏమి జరిగిందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఓ ప్రజాప్రతినిధి సత్యసాయి నీటిని దొంగచాటుగా తోటకు వదులుకోవడంతో ఇన్నాళ్లుగా గ్రామాలకు నీరు సరఫరా కాలేదని గుసగుసలాడుకుంటున్నారు. నాలుగేళ్లగా నీటి చౌర్యం జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఏంటని ప్రజలు మండిపడుతున్నారు. సామాన్యులు సత్యసాయి కొళాయిని ఇంటికి వేసుకున్నట్లు తె లిస్తే, అధికారులు ఆగమేఘాలపై వచ్చి వారిపైచర్యలు తీసుకుంటా రు. అయితే నాలుగేళ్లుగా ఓ ప్రజాప్రతినిధి సత్యసాయి నీటిని దొంగచాటుగా తన తోటకు మళ్లిస్తుండడంపై ఎందుకు స్పందించలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. సామాన్యులకు ఒక న్యాయము, ప్రజాప్రతినిధికి మరో న్యాయమా అని నిలదీస్తున్నారు. వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ఓ ప్రజాప్రతినిధి గుట్టు చప్పుడు కాకుండా తన ఊరు సమీపంలో సత్యసాయి ప్రధాన పైపులైన్ ద్వారా అక్రమంగా కనెక్షన్ తీసుకుని మామిడి తోటకు నీటిని వాడుకుంటుంటున్నారు. అయితే నాలుగేళ్ల తర్వాత అధికారులు ఆ గ్రామానికెళ్లి అక్రమ కనె క్షన్ తొలగించారు. దీంతో గ్రామాలకు నీరు సరఫరా అవుతున్నట్లు ప్రజలు చె బుతున్నారు. దీనిబట్టి చూస్తే ఇన్నాళ్లు అధికారులు ఏమి చేస్తున్నారని మండిపడుతున్నారు. విషయం తెలిసినా ప్రజాప్రతినిధిపై చర్యలు చేపట్టలేకపోయినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత మూడు రోజులుగా రాగానిపల్లి, నల్లమాడకు నీరు వస్తున్నాయని, నాలుగేళ్ల నుంచి రాని నీరు ఇప్పుడెలా వస్తున్నాయని మహిళలు వాపోతున్నారు. బొగ్గలపల్లి, రామాపురం, మనకవంకపల్లి, గోపేపల్లిలకు ఇంకా రాలేదని ఆ గ్రామస్థులు అంటున్నారు. ఇకనుంచైనా సత్యసాయి నీరు అక్రమంగా తరలిపోకుండా గ్రామాలకు నీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రెండేళ్లుగా నీరు పంప్‌హౌస్‌కు రాలేదు

రెండేళ్లుగా సత్యసాయి నీరు నల్లమాడ పంపు హౌస్‌కు రాలేదు. చిన్నకోట్ల వద్ద ఉన్న పంపు హౌస్‌లో మోటార్లు మరమ్మతులకు గురవడంతో నీటి సరఫరా ఆగిపోయింది. ఇటీవల అక్కడ మరమ్మతులు చేసి.. గత నాలుగురోజుల నుంచి నీటిని సరఫరా చేస్తున్నాం. వేళ్లమద్ది, వంకరకుంట, ఎర్రవంకపల్లి, రెడ్డిపల్లి, పాతబత్తలపల్లి పైప్‌లైన్లు మరమ్మతులుకాక నీటి సరఫరాకు నోచుకోలేదు. ప్రస్తుతం మరమ్మతులు చేసి నీరు సరఫరా చేస్తున్నాం.

– శశికళ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

ఉపాధి పనులు కల్పించాల్సిందే : ఏపీడీ

తనకల్లు, ఏప్రిల్ 10: మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఉపాధి కూలీలకు పనులు కల్పించాల్సిందేనని ఏపీడీ రమేష్‌బాబు సిబ్బందికి సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి హామీ సిబ్బందితో ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలన్నారు. ప్రతిరోజూ ఐదువేలమంది కూలీలు తగ్గకుండా పనులకు వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా కూలీలు వ్యవసాయ పనులు లేక ఖాళీగా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. కూలీలకు పనులు కల్పించే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, ఏపీఓ మరియమ్మ, ఈసీ శ్రీనివాసులరెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నిప్పంటుకుని మహిళకు తీవ్రగాయాలు

తనకల్లు, ఏప్రిల్ 10: మండలంలోని చీకటిమానుపల్లి గ్రామానికి చెందిన అనిత అనే మహిళకు బుధవారం ఇంటిలో నిప్పు అంటుకుని తీవ్రగాయాలయ్యాయి. బంధువులు, గ్రామస్థులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. అనిత తన భర్త నరసింహులుతో గొడవపడింది. ఈ గొడవలో తానే నిప్పు పెట్టుకుందా, లేక భర్త నిప్పు పెట్టారో తెలియడం లేదు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది వెంటనే వచ్చి మహిళను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. సంఘటన జరిగిన వెంటనే భర్త నరసింహులు పరారైనట్లు చెప్పారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి

నల్లచెరువు, ఏప్రిల్ 10: మండలంలోని ప్యాయలవాండ్లపల్లి బస్‌స్టాప్ వద్ద బుధవారం గుర్తు తెలియని వాహనం రెండు జింకలను ఢీకొనడంతో ఒక జింక అక్కడిక్కడే మృతిచెందింది. మరో జింక గాయపడింది. అటువైపు వెళ్తున్న వాహనదారులు అటవీశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ అధికారులు అక్కడికి చేరుకుని మృతిచెందిన జింకకు దహనసంస్కారాలు చేసి, గాయపడిన జింకను ఆస్పత్రికి తరలించారు. కదిరి, మదనపల్లి రహదారిపై జింకలు అధికంగా సంచరిస్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని పోలీసులు హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రాలేదు. కాగా రోడ్డుపై అక్కడక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే బాగుటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని బాగు చేయించాలని వినతి

ధర్మవరం, ఏప్రిల్ 10: పట్టణంలోని కళాజ్యోతి సర్కిల్‌లో ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి మరమ్మతులు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహంలోని చేతిభాగం కొంత దెబ్బ తిందని, బాగు చేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కేశగాళ్ల వెంకటేశ్, బూదెప్ప, రామాంజనేయులు, గంగుల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో అందని ఉపాధి బిల్లులు



మండుటెండలో పని చేస్తున్న కూలీలు

◆ జిల్లాలో 25 వేల మందికి అందాల్సిన రూ.17 కోట్లు

◆ అప్పులు పుట్టవు.. స్థానికంగా పనులు దొరకవు..

◆ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న కూలీలు

మడకశిర, ఏప్రిల్10: ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేసి ఆరు వారాలు అవుతున్నా బిల్లులు నేటికీ తమ ఖాతాల్లోకి జమకాలేదని, అప్పులు చేసి జీవనం సాగించే పరిస్థితి నెలకొందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు వారాలకు గాను రెండు వారాల బిల్లులు కూలీల ఖాతాలలోకి జమచేశారు. మిగతా నాలుగు వారాలకు సంబంధించిన బిల్లులు జమ కావాల్సిఉంది. జిల్లాలో రెండు లక్షల మందికి జాబ్ కార్డులున్నాయి. అందులో పనికి వచ్చే కూలీలు లక్ష మంది దాకా ఉన్నారు. గత సంవత్సరం 40 వేల మంది కూలీలు 100 పనిదినాలు పూర్తి చేసుకున్నారు. మిగిలిన 60 శాతం పైబడి కూలీలు ఉపాధి పనులకు వెళ్లేందుకు అర్హులు. అందులో పనులు చేసిన 25 వేల మంది కూలీలకు రూ. 17 కోట్లు దాకా బిల్లులు రావాల్సి ఉంది.వారందరూ పనులు చేసి ఒకటిన్నర నెల దాటుతున్నా ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడం తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగే బిల్లులు చెల్లించడం ఆలస్యమైతే తమకు అప్పులు కూడా పుట్టవని, పనులు కూడా అంతతంత మాత్రంగానే ఉన్నాయని వారు వాపోతున్నారు. పనులు చేసినా సకాలంలో బిల్లు అందక పోవడంతో పస్తులు ఉండే పరిస్థితి నెలకుంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లు ల కోసం కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇలాగే కొనసాగితే విధిలేని పరిస్థితుల్లో పనుల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లక తప్పదంటున్నారు. గతంలో వారానికి బిల్లులు ఖతాల్లోకి జమఅయ్యేవని, ప్రస్తుతం ఆరువారాలు గడుస్తున్నా బిల్లులు అందలేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికంగా ఉపాధి లేదు

మడకశిర నిమోజకవర్గంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా గ్రామాల్లో వ్యవసాయ పనులులేవు. అలాగే స్థానికంగా ఎటువంటి ఉపాధి అవకాశాలు లేవు. దీంతో చాలా మంది కూలీలు ఉపాది హామి పథకం పనులపైనే ఆధార పడి జీవనం సాగిస్తున్నారు. కరోనా రాక మునుపు ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లు. మూడేళ్ల కిందట కరోనా మహమ్మారి విజృంభించడంతో అక్కడి నుంచి వచ్చి తిరిగి వచ్చేశారు. తమ స్వగ్రామాల్లోనే జాబ్ కార్డులు చేసుకుని పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అటువంటి తాము మండుటెండను సైతం లెక్కచేయకుండా పనులు చేసినా సకాలంలో బిల్లులు చెల్లించక పోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పండుగ కోసం అప్పులు చేయాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని రోజులు బిల్లులు చెల్లించకపోతే అప్పలు కూడా పుట్టవన్నారు.

వంద పనిదినాలు పూర్తయిన వారికి పనుల కొరత

వంద పనిదినాలు పూర్తి చేసుకున్న కూలీలు పనుల కోసం వెదుక్కోవాల్సి వస్తోంది. జిల్లాలో 100 పని దినాలు పూర్తి చేసుకున్న వారు దాదాపు 40 వేల మంది దాకా ఉన్నారు. వ్యవసాయ పనులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మూడేళ్ల కిందట కరోనా విజృంభించడంతో రెండేళ్ల కిందటి వరకు వంద రోజులు పనులు పూర్తి అయిన వారికి అదనంగా 50 రోజులు పనులు కల్పించే వారు. ప్రస్తుతం అలా కల్పించడం లేదని, దీంతో తాము పనుల కోసం వలస వెళ్లక తప్పదంటున్నారు. ప్రతి ఒక్క కూలీకి పనులు కల్పించాలని కోరుతున్నారు.

రూ. 17 కోట్ల దాకా అందాల్సిన బిల్లులు

జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన 25 వేల మంది కూలీలకు రూ. 17 కోట్లు దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. పనులు చేసిన ఆరు వారాలకు సంబంధించి రెండు వారాల బిల్లులు ఇటీవలే చెల్లించారు. మిగతా నాలుగు వారాలకు సంబంధించి మడకశిర నియోజకవర్గంలో దాదాపు రూ. కోటి దాకా బిల్లు చెల్లించాల్సి ఉంది. మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాలకు కూలీలకు ఒక్కో మండలానికి దాదాపు రూ.20 లక్షలు దాకా చెల్లించాల్సి ఉంది. బిల్లులు సకాలంలో చెల్లించాలని కూలీలు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

కుటుంబ పోషణ కష్టంగా మారింది



ఉపాధి హామి పథకం ద్వారా పనులు చేసినా సకాలంలో బిల్లులు రావడం లేదు. తాము పనులు చేసి ఆరు వారాలు అవుతోంది. ఇటీవల రెండు వారాల బిల్లులు ఖాతాల్లోకి జమ చేశారు. ఇంకా నాలుగు వారాల బిల్లులు జమ కాలేదు. దీంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో కుటుంబ పోషణ కష్ట సాధ్యంగా మా రింది. గతంలో మాదిరి సకాలంలో బిల్లులు చెల్లించాలి.

- కదిరేష్, ఉపాధి హామీ కూలీ, మల్లినమడుగు

రెండు వారాల బిల్లులు చెల్లించాం

ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేసిన కూలీలకు ఆరు వారాలకు సంబంధించి బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఇటీవలే రెండు వారాల బిల్లులు కూలీల ఖాతాల్లోకి జమ అయినాయి. మిగతా నాలుగు వారాలకు సంబంధించి త్వరలోనే వారి ఖాతాల్లోకి జమ అవుతాయి. కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నాం.

- శ్రీకాంత్, ఏపీఓ, ఎన్ఆర్ఈజీఎస్

నేటి నుంచి జయహో బీసీ సదస్సులు

రొద్దం, ఏప్రిల్ 10: మండలంలోని పలు పంచాయతీల్లో గురువారం నుంచి 15వరకు జరిగే జయహో బీసీ సదస్సులను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఆర్ మరువపల్లిలో ఉన్న టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు స్వగృహంలో బుధవారం టీడీపీ మండల నాయకులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గురువారం దొడగట్ట, శుక్రవారం నారనాగేపల్లి, ఈ నెల 13న కంబాలపల్లి, 14న లోచర్ల, 15న చోళేమర్రి పంచాయతీలలో జయహో బీసీ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో హిందూ పురం ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి, ఎమ్మెల్యే అభ్యర్థి సవిత, మండల నాయకులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నాయకులు నరహరి, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల వద్ద గట్టి బందోబస్తు : ఎస్ఐ

అగళి, ఏప్రిల్ 10 : త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మండలంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వీరేష్ తెలిపారు. ఆయన బుధవారం మండలపరిధిలోని ఆలూడి, పీ బ్యాడిగెర బొమ్మర్సనపల్లి చెక్‌పోస్టులను వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చెక్‌పోస్టుల వద్ద వాహనాల రాకపోకలపై నిఘా ఉంచాలని చెక్‌పోస్టు ల సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. అలాగే ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కర్ణాటక మద్యం రవాణా, పేకాట, మట్కా, నాటుసారా తయారీ, విక్రయం, ఇసుక అక్రమ రవాణా తదితర వాటిపై గట్టి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీరాములు, బషీర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

దుప్పి మాంసం స్వాధీనం



దుప్పి మాంసం, నిందితుడితో అటవీ అధికారులు

గోరంట్ల, ఏప్రిల్ 10: మండలంలోని వెంకటరమణపల్లికి చెందిన వడ్డె రామచంద్రప్ప ఇంట్లో అటవీశాఖా ధికారులు మంగళవారం రాత్రి దుప్పి మాంసం స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వడ్డె రామచంద్రప్ప తన పొలంలోనే ఇల్లు నిర్మించుకుని వ్యవసాయం చేస్తున్నాడు. దుప్పిని వేటాడి మాంసాన్ని బావివద్ద ఉంచాడన్న సమాచారంతో అటవీ శాఖాధికారులు మంగళవారం రాత్రి 11గంటల సమయం లో దాడిచేశారు. అతడు నివాసముంటున్న షెడ్‌ను తనిఖీ చేయగా దాదాపు ఐదు కిలోల దుప్పి మాంసం లభ్యమైంది. మాంసంతోపాటు వడ్డె రామచంద్రప్పను అరెస్టుచేసి, బుక్కపట్నం అటవీ రేంజింగ్ కార్యాలయానికి తరలించారు. తన పొలం వద్ద కుక్కల దాడిలో దుప్పి తీవ్రంగా గాయపడగా, దాని మాంసాన్ని తాను సేకరించినట్లు విచారణలో తెలిసిందని అటవీ అధికారులు తెలిపారు. వన్యప్రాణులను వేటాడే వారి గురించి ప్రజలు సమాచారం ఇవ్వాలని డీఎఫ్ఓ రవీంద్రారెడ్డి కోరారు. ఈ దాడిలో ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరెడ్డి, అధికారులు ఇసాక్ బాషా, రామక్రిష్ణ, రాహుల్ పాల్గొన్నారు.

ఎద్దు మాంసం విక్రయదారుడి అరెస్ట్

రొద్దం, ఏప్రిల్ 10: మండలంలోని చెరుకూరు శివారు ప్రాంతంలో ఎద్దుల మాంసం విక్రయిస్తున్న షేక్ నయాజ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వలీబాషా తెలిపారు. మండల పరిధిలోని చెరుకూరు ప్రాంతంలో బుధవారం హిందూపురం పట్టణంలోని రహమత్‌పురానికి చెందిన షేక్ నయాజ్ ఎద్దు మాంసం విక్రయిస్తుండగా గ్రామస్థుల ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేశామన్నారు. పశువుల మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట కానిస్టేబుల్ అనీల్ ఉన్నాడు.

మహిళ ఆత్మహత్య

మడకశిర రూరల్, ఏప్రిల్ 10: మండలంలోని బుళ్లసముద్రం గ్రామంలో నేత్రవతి (27) అనే మహిళ బుధవారం సాయత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ మనోహర్ తెలిపారు. గుండబండ మండలం గుడ్డదహళ్లికి చెందిన నేత్రవతికి, మడకశిర మండలం బుళ్లసముద్రం గ్రామానికి చెందిన రామాంజనేయులుతో వివాహమైంది. పెళ్లయి ఎనిమిదేళ్లు అయినా సంతానం లేకపోవడంతో మనస్థాపం చెందిన నేత్రవతి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి సుశీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాద బాధితుడి మృతి

రొద్దం, ఏప్రిల్ 10: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కర్ణాటక ప్రాంతం కొడుమడుగు గ్రామానికి చెందిన నరసింహ(18) అనే విద్యార్థి మంగళవారం రాత్రి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. రొద్దం మండల పరిధిలోని ఆర్ మరువపల్లి సమీపంలో ఉన్న నమాజు కట్ట మలుపు వద్ద దిచక్రవాహనం అదుపుతప్పి నరసింహ, దినేష్ అనే విద్యార్థులు తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. వారిని రొద్దం ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స అనంతరం పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా చికిత్స పొందుతూ నరసింహ మృతిచెందాడు. కొడుమడుగు గ్రామానికి చెందిన కిష్టప్ప, అరుణ దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు నరసింహ. ఇటీవలే పావగడలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేశాడు. కొడుమడుగు గ్రామం నుంచి తమ్ముడు దినేష్‌ను రొద్దం మండలం కుర్లపల్లిలో వదిలేందుకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మలుపు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వలీబాష తెలిపారు.

గడ్డివాముల దహనం

లేపాక్షి, ఏప్రిల్ 10 : పశువుల మేతకోసం ఉంచిన గడ్డివాములకు మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో అవి పూర్తిగా కాలిపోయాయని బాధిత రైతు గంగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. మండలంలోని సోమిరెడ్డిపల్లికి చెందిన గంగిరెడ్డి అనే రైతు ఎనిమిది పశువులను మేపుకుంటున్నాడు. వాటి కోసం దాదాపు ఆరు లోడ్‌ల మొక్కజొన్న చొప్ప, వేరుశనగ పొట్టును కొనుగోలుచేసి ఊరిబయట వాములు వేశాడు. అయితే కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు వాటికి నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో పశువులకు మేత లేకుండా పోయిందని బాధిత రైతు , కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రజలు మెచ్చే పాలన టీడీపీకే సాధ్యం

పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో సవిత

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 10 : ప్రజలు మెచ్చిన పాలన అందించేది ఒక్క తెలుగుదేశం పార్టీకేనని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం అధికార పార్టీ వైసీపీ నుంచి 50కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. సోమందేపల్లి మండలంలోని నూకలపల్లి, కొల్లకుంట, ముద్దపుకుంట గ్రామపెద్దలు, యువత తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. వారికి సవిత కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఎక్కడికీ వెళ్లనవసరం లేదన్నారు. ఇక్కడే మంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు. రోజు రోజుకు టీడీపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్ రూ.4వేలు అందిస్తామన్నారు. ఈ ఐదు సంవత్సరాల్లో వైసీపీ అరాచకం భరించలేక టీడీపీలోకి భారీగా చేరికలు జరుగుతున్నాయని సవిత పేర్కొన్నారు.

బాధితుడికి సవిత పరామర్శ



గాయపడిన లక్ష్మీనరసప్పను పరామర్శిస్తున్న సవిత

హిందూపురం, ఏప్రిల్ 10: వైసీపీ నాయకుల చేతిలో గాయపడి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మీ నరసప్పను టీడీపీ పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వారు వైసీపీ నాయకులు కాదు గూండలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ కార్యకర్తలపై దాడి చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. లక్ష్మీనరసప్పపై దాడి చేసిన గూండాలను అరెస్టు చేయాలన్నారు. లేని పక్షంలో టీడీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. దీనిపై గోరంట్ల సీఐ వెంటనే స్పందించాలన్నారు. టీడీపీ నాయకులు మాట్లాడుతూ న్యాయపరంగా టీడీపీపై దాడులు చేయడానికి ఏమి లేవని దొంగచాటున దాడి చేయడం సిగ్గుచేటన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలన్నారు.

టీడీపీ గెలుపును ఎవరూ అడ్డుకోలేరు

మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న



కండువాలువేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మద్దనకుంట ఈరన్న

మడకశిరటౌన్, ఏప్రిల్ 10: నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి గెలుపును ఎవ్వరూ అడ్డుకోలేరని, వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా గెలుపు టీడీపీదేనని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం మండలంలోని మాళేరొప్పం గ్రామానికి చెం దిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వైసీపీకి చెందిన రమేష్, నవీన్, మహేష్‌తోపాటు దాదాపు 12 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే ఈరన్న పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన సీఎం జగన్ ప్రజల విశ్వాసం కోల్పోయారని విమర్శించారు. దీంతో ప్రజలు అధికార మార్పిడిని కోరుకొంటున్నారని అన్నారు. అవినీతి పాలనకు చరమ గీతం పాడేందుకు ప్రజ లు సిద్ధంగా ఉన్నారని, మే 13న జరిగే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణ పాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు ఆదినారాయణ, అశ్వత్థరామప్ప, బొజప్ప, జనసేన మండల కన్వీనర్ శివాజీ తదితరులు ఉన్నారు.

బైక్‌ర్యాలీని విజయవంతం చేయండి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఏప్రిల్ 10: పట్టణంలోని పెనుకొండ రోడ్డులో ఉన్న టీడీపీ కార్యాలయం వద్ద నుంచి ఈనెల 12వతేదీన బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ర్యాలీని ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తామని, నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో బైక్ ర్యాలీ జరుగుతుందన్నా రు. మడకశిరలో ఉదయం 10 గంటలకు బయలుదేరి, 11 గంటలకు రొళ్ల మండల కేంద్రం, 12 గంటలకు అగళి చేరుతుందన్నారు. అలాగే ఒంటి గంటకు గుడిబండ, 2 గంటలకు అమరాపురం మండల కేంద్రంలో బైక్‌ర్యాలీ ముగుస్తుందన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బాధిత మహిళకు నిత్యవసరాల పంపిణీ

గోరంట్ల, ఏప్రిల్ 10: పట్టణంలోని పులేరు రహదారిలో సంచార జాతికి చెందిన రామక్క గుడారం అగ్నిప్రమాదంలో దగ్ధం కాగా ఆమెకు రెడ్ క్రాస్ సంస్థ వారు బుధవారం నిత్యవసర వస్తువులు అందజేశారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో గుడారం పూర్తిగా కాలిపోయి, రూ. 2లక్షలు నష్టం జరిగింది.

విద్యుత్ స్తంభంపై తీగల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



స్తంభానికి ఎగబాకిన తీగలను తొలగించిన దృశ్యం

మడకశిర రూరల్, ఏప్రిల్ 10 : మండంలోని కల్లుమర్రి గ్రామంలో ఉన్న విద్యుత్ స్తంభానికి ఎగబాకిన తీగలను ఆ శాఖ అధికారులు బుధవారం తొలగించారు. ఆంధ్రజ్యోతిలో ఈ నెల 8న 'విద్యుత్ స్తంభానికి ఎగబాకిన తీగ' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఆ గ్రామానికి వెళ్లి విద్యుత్ స్తంభానికి ఎగబాకిన చెట్లు తీగలను తొలగించారు దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

సార్వత్రిక ఎన్నికలపై శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న మాస్టర్ ట్రైనర్లు, పీఓలు, ఏపీఓలు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 10: ఈ సంవత్సరం మే నెలలో జరుగు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా బుధవారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో పోలింగ్ పీఓలు, ఏపీఓలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. హిందూపురం మండల తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీఓలు, ఏపీఓలకు మాస్టర్ ట్రైనర్లు శిక్షణ అందించారు. పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు ఇస్మాయిల్, గణేష్, సురేష్, సునీల్‌తో పాటు ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భార్యను కాపురానికి పంపలేదని గొంతు కోసుకున్న భర్త



చికిత్స పొందుతున్న శివ

గోరంట్ల, ఏప్రిల్ 10: భార్యను కాపురానికి పంపలేదని మండలంలోని కల్లుమర్రికి చెందిన శివ గొంతుకోసుకుని బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కల్లుమర్రి గ్రామంలోని చాకలి గంగాద్రి కుమారుడు శివ వెల్డింగ్ పని చేస్తుంటాడు. ఎగువ గంగంపల్లికి చెందిన చాకలి శ్రీరాములు కుమార్తె గీతాంజలితో రెండేళ్ల కిందట అతడికి వివాహమైంది. గీతాంజలి 11నెలల కిందట ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. తాగుడుకు బానిసైన శివ భార్యతో తరచూ గొడవపడేవాడు. ఇలాఉండగా ఉగాది పండుగకోసం మంగళవారం శివ అత్తగారింటికి వెళ్లాడు. భార్యను తనతో పంపాలని అత్తమామలను కోరాడు. మనవడికి శనివారం కేశఖండన చేశాక పంపుతామని వారు తెలిపారు. అయితేతన భార్యను కాపురానికి పంపలేదంటూ మనస్థాపం చెంది మద్యం తాగిన మత్తులో శివ అత్తగారింట్లోనే బ్లేడుతో పలుమార్లు గొంతుకోసుకున్నట్లు బంధువులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన అతడిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స నిర్వహించారు. గొంతులోని థైరాయిడ్ ఎముక కనిపించేలా కోసుకోవడంతో మాట్లాడలేని స్థితిలో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు. భర్త ఆత్మహత్యయత్నంపై భార్య గీతాంజలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లకు గ్రహణం



కంకరతేలి రాకపోకలకు ఇబ్బందిగా మారిన మధురేపల్లి రోడ్డు

❖ టీడీపీ హయాంలో రోడ్ల అభివృద్ధి పనులు మంజూరు

❖ ఆ తరువాత ముందుకు సాగని పనులు

❖ ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

చిలమత్తూరు, ఏప్రిల్ 10: గ్రామీణ లింకు రోడ్లను బీటీ రోడ్లుగా మార్పువేసి ప్రజా రవాణాను బాగుచేసేందుకు 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం మండలంలోని పలు గ్రామాల రోడ్ల అభివృద్ధికి చొరవ చూపింది. అయితే అనంతరం జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో వాటి అభివృద్ధికి గ్రహణం పట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా పలు గ్రామాలకు లింకురోడ్లు సరిగా లేని కారణంగా ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని మధురేపల్లి, ఎస్ ముద్దిరెడ్డిపల్లి, కందూరుపర్తి, కమ్మయ్యగారిపల్లి, కమ్మయ్యగారిపల్లి తండా, తిమ్మాడపల్లి, ఓబుళాపురం, తమ్మినాయనపల్లి, వైగొల్లపల్లి గ్రామాలకు లింకు రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం ఈ గ్రామాల రోడ్లను బాగుచేయాలన్న ఉద్దేశ్యంతో వాటి పనుల కోసం టెండర్లు నిర్వహించారు. అంతలోగా ఎన్నికలు రావడంతో నిధుల మంజూరుకు ఆటంకం ఏర్పడింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ అధికారంలోకి వచ్చింది. మంజూరైన రోడ్ల అభివృద్ధి పేరుతో ఉన్న రోడ్లను తవ్వేసి, ఆ తరువాత చేపట్టవలసిన అభివృద్ధిని గాలికి వదిలేసింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్న రోడ్లను యంత్రాలతో తవ్వించేసి.... నిధులు లేవంటూ వదిలేశారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగా రోడ్డు మొత్తం పెద్ద పెద్ద కంకర రాళ్లతో తేలిపోయాయి. ఈ కారణంగా కాలి నడకతో మొదలు కొని ఆటోలు, కార్లు, చివరికి ఎద్దుల బండి వెళ్లాలన్నా ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. కంకర రాళ్లపై వేగంగా వెళ్లలేక...ఒక కిలోమీటరు ప్రయాణం చేయడానికి గంట సమయం తీసుకుంటోందని తెలుపుతున్నారు. వర్షం వస్తే తవ్విన రోడ్డుపై మోకాలు లోతు నీళ్లు నిలబడి రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఆ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మధురేపల్లి నుంచి కోడూరు తోపుకి రావాలంటూ రోజూ నానా ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా ఎస్ ముద్దిరెడ్డిపల్లి గ్రామానికి ఉన్న రోడ్డు చిన్నపాటి వర్షానికి చిత్తడైపోయి వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురుచేస్తోంది. ఈ కారణంగా ఆ గ్రామానికి వర్షాకాలంలో రాకపోకలు స్తంభిస్తున్నాయి. కమ్మయ్యగారిపల్లిలో ఎక్కువగా రైతులు ఉన్నారు. వారు గ్రామం నుంచి గోరంట్ల- కదిరి రోడ్డులోకి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింకు రోడ్డు అధ్వానంగా మారడంతో వారికి కష్టాలు తప్పడం లేదు. తిమ్మాడపల్లి గ్రామస్థులు కంకర రాళ్ల మధ్య రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా లింకు రోడ్లను బాగు చేయకపోగా ఉన్న రోడ్లను తవ్వేయడంతో రాకపోకలప్పుడు నరకం చవిచూస్తున్నామని ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో రోడ్ల అభివృద్ధి చేయకపోవడంతో వైసీపీ పాలనపై గ్రామీణులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నడిరోడ్డుపై మురుగుగుంత

మడకశిర రూరల్, ఏప్రిల్ 10: మండలంలో తడకలపల్లిలో డ్రైనేజీ నీరంతా ప్రధాన రహదారిలోకి చేరుతోంది. ఇది గ్రామ సమీపంలో రహదారిలో మురుగునీటి గుంటగా మారింది. దీంతో గ్రామంలోకి వెళ్లే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తడకలపల్లి నుంచి మణూరుకు వేళ్లేందుకు ప్రధాన రహదారి ఉంది. తడకలపల్లిలోని బస్టాండు వద్ద ప్రధాన రహదారిలో పెద్ద గుంత ఏర్పడింది. గ్రామంలోని డ్రైనేజీ నీరంతా ప్రధాన రహదారిలోని గుంతలోకి చేరుతోంది. ఇది చిన్న మడుగును తలపిస్తోంది. దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా రహదారిలో రాకపోకలకు పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో కల్వర్టు నిర్మించాలని తడకలపల్లి గ్రామస్థులు కోరుతున్నారు.



తడకలపల్లిలో ప్రధాన రహదారిపై ఏర్పడిన మురుగునీటి గుంత

వైభవంగా రేణుకా యల్లమ్మ జాతర

నల్లచెరువు, ఏప్రిల్ 10: మండలంలోని ఓరువాయిగ్రామంలో బుధవారం రేణుకా యల్లమ్మ జాతర వైభవంగా జరిగింది. ఉగా ది ఉత్సవాల్లో భాగంగా ప్రతి యేటా ఈజాతర ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీ. ఈ క్రమంలో పూజారులు అమ్మవారిని పట్టువస్త్రాలు, ఆభరాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం పూజలు చేశా రు. స్థానికులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరలో అమ్మవారి ఉత్సవ విగ్ర హం ఊరేంపు చేశారు. రైతులు పన్నేరపు బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం పార్వేట నిర్వహించారు. చెక్కభజనలు, పాండ్రభజనలు, కోలాటలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఓరువాయి గ్రామం గ్రామస్థుల బంధుమిత్రులతో కిటకిటలాడింది. ఎస్ఐ లింగన్న సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

నల్లచెరువులో..

మండలకేంద్రంలో యల్లమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి జ్యోతులు సమర్పించి మొక్కులు తీసుకున్నారు. కీలుగుర్రాల వేషధారణలో కళాకారులు అలరించారు. జాతరలో ఉట్టిమాను ఉత్సవం జరిగింది.

ముగిసిన పడమటి ఈరన్న ఉత్సవాలు

తాడిమర్రి, ఏప్రిల్ 10: మండలంలోని ఆత్మకూరు గ్రామంలో జరుగుతున్న పడమటి ఈరన్న స్వామి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఉగాది పండుగ ముందు రోజు నుంచి ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజుల పాటుగా సాగాయి.మండలంతో పాటు ముదిగుబ్బ, బత్తలపల్లి, నార్పల, లింగాల మండలాల నుంచి కూడా భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. బియ్యం,బేడలు, పాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు.